సాక్షి అనంతపురం

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



సమస్య పరిష్కరించాలంటూ గొడవ

తనకు మంజూరైన టిడ్కో ఇంటిని వేరొకరికి ఇచ్చారని, అర్జీలిచ్చినా పట్టించుకోలేదంటూ ఓ వ్యక్తి గొడవకు దిగాడు. 8లో



టమాట కిలో రూ.44

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.44 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

35.4°/21.7°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు 'ఎల్లో అలర్ట్'

- నాలుగు రోజులూ వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల నాలుగు రోజులూ ఉమ్మడి జిల్లాకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన తెలియజేస్తూ వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ప్రధానంగా ఈనెల 5న మంగళవారం 'పింక్ అలర్ట్' కింద ఉమ్మడి జిల్లాలో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షసూచన కూడా ఉందన్నారు. 6, 7, 8 తేదీల్లో ఎల్లో అలర్ట్ కింద మోస్తరుగా వర్షసూచన ఉన్నట్లు తెలిపారు. కాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో పలు చోట్ల వర్షం పడింది. శెట్టూరులో 28.4 మి.మీ, బ్రహ్మసముద్రం 14.2 మి.మీతో పాటు ఆత్మకూరు, కళ్యాణదుర్గం, బుక్కరాయసముద్రం, అనంతపురం మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



గుత్తిలో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

గుత్తి: స్థానిక మారుతీనగర్, జంగాల కాలనీ వాసులు తాగునీటి కోసం సోమవారం రోడ్డెక్కారు. మహిళలు ఖాళీ బిందెలు తీసుకుని ర్యాలీగా తాడిపత్రి సర్కిల్‌లోకి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. నెలకు ఒకసారి కూడా తాగునీటిని సరఫరా చేయడం లేదని వాపోయారు. తాగునీటిని సరఫరా చేసే వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని సర్ది చెప్పడానికి ప్రయత్నించగా వాగ్వాదానికి దిగారు. వెంటనే తాగునీటిని సరఫరా చేయిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు

- జిల్లా వ్యాప్తంగా సీడీపీఓలకు తిరిగిచ్చేసిన అంగన్‌వాడీలు



అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతపురం సెంట్రల్/రాప్తాడు రూరల్: 'ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు బాబోయ్' అంటూ అంగన్‌వాడీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టు సీడీపీఓలకు సెల్‌ఫోన్లు తిరిగిచ్చేశారు. జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గతంలో ప్రతి కేంద్రానికీ స్మార్ట్‌ఫోన్ అందించారు. చిన్నారులు, గర్భిణుల హాజరుతోపాటు వారికి అందిస్తున్న పౌష్టికాహారం, ఇతరత్రా కార్యక్రమాల వివరాలను వీటి ద్వారానే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే సెల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదని అంగన్‌వాడీలు ఫిర్యాదులు చేస్తున్నా స్పందన కరువైంది. ఇటీవల పని ఒత్తిడి మరింత ఎక్కువ కావడంతో తాము ఇక భరించలేమంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్లను తిరిగిచ్చేశారు. అనంతపురం అర్బన్ మినహా జిల్లాలో అన్ని ప్రాజెక్టుల్లో సోమవారం అధికారులకు అప్పగించారు. అయితే సెల్‌ఫోన్లు తీసుకోవడానికి కొందరు సీడీపీఓలు, అధికారులు నిరాకరించగా.. అంగన్‌వాడీ సిబ్బంది మాత్రం సెల్‌ఫోన్లు మాకొద్దు అంటూ స్పష్టం చేశారు.

పని చేయలేకపోతున్నాం

ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగా పని చేయడం లేదు. ఒక్కో పనికి గంటల పాటు సమయం పడుతుండడంతో అంగన్‌వాడీ వర్కర్లు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో ఐదారుగురు బలవన్మరణాలకు కూడా పాల్పడ్డారు. కొత్త ఫోన్లు ఇచ్చే వరకూ ఆన్‌లైన్ చేయం అని స్పష్టంగా తెలియజేసి వెనక్కు ఇచ్చాం.

– రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

త్వరలో కొత్త ఫోన్లు మంజూరు

సెల్‌ఫోన్లు మొరాయిస్తున్నాయని గతంలోనే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈనెలాఖరులోగా కొత్త సెల్‌ఫోన్లు వస్తాయని తెలుస్తోంది. అంతవరకూ ఆన్‌లైన్ ద్వారా సేవలందించాలని అంగన్‌వాడీ వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

– నాగమణి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

కమ్మేస్తున్న.. కరువు మేఘం

'అనంత'ను కరువు ఛాయలు కమ్మేస్తున్నాయి. రైతులను మరోసారి ఈ రక్కసి కబళించే దుస్థితి దాపురించింది. గతేడాది అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో భారీ నష్టాలు చవిచూసిన జిల్లా రైతులు.. ఈ ఏడాది కూడా అంతకు మించి నష్టాలు మూటగట్టుకునే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. 'చంద్రబాబు–కరువు కవలల'ంటూ విపక్షాలు తరచుగా చేసే విమర్శలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.



బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంటలో వర్షం కోసం బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



దిగాలుగా ఆకాశం వైపు చూస్తున్న రైతు

- రక్కసి కోరల్లోకి అన్నదాతలు
- సీజన్ ముగిసినా 40 శాతం విస్తీర్ణంలోనే పంటల సాగు
- వర్షాలు లేక ఆ పంటలూ ఎండుముఖం
- 'చంద్రబాబు–కరువు కవలలు' అంశంపై మళ్లీ చర్చ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాను ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించినా ఏ మాత్రమూ ప్రభావం చూపడం లేదు. 'నైరుతి' ప్రవేశానికి ముందు ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు కురిశాయి. ఏప్రిల్‌లో 12.1 మి.మీ గానూ నాలుగింతలు అధికంగా 56.3 మి.మీ, మేలో 36.7 మి.మీ గానూ ఏకంగా 101.3 మి.మీ వర్షపాతం నమోదైంది. తీరా జూన్‌లో ఖరీఫ్ మొదలయ్యే నాటికి వరుణుడు ముఖం చాటేశాడు. జూన్ 8, 12 తేదీల్లో మాత్రమే మోస్తరు వర్షపాతం నమోదైంది. జూన్ ముగిసేనాటికి 61.2 మి.మీ గానూ 21.7 శాతం తక్కువగా 47.9 మి.మీ వర్షం పడింది. పంటలు విత్తుకునేందుకు కీలకమైన జూలైలో వాన కోసం ఎదురుచూసినా ఫలితం కనిపించలేదు. జూలైలో 64.3 మి.మీ గానూ 46.4 శాతం తక్కువగా కేవలం 34.7 మి.మీ వర్షం కురిసింది. మొత్తమ్మీద 131.1 మి.మీ గానూ ప్రస్తుతానికి 37 శాతం లోటు వర్షపాతంతో 82.7 మి.మీ నమోదైంది. ఒక మండలంలో మాత్రమే సాధారణం కన్నా అధిక వర్షం కురిసింది. 7 మండలాల్లో సాధారణం నమోదు కాగా మిగతా 24 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్ మొదట్లోనే సుదీర్ఘ వర్షపాత విరామాలు (డ్రైస్పెల్స్) నమోదు కావడం కరువు పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.



అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామ సమీపంలో ఎండిపోతున్న వేరుశనగ పంట

ఎండుతున్న పంటలు..

అడపాదడపా కురిసిన వర్షాలకే విధి లేని పరిస్థితుల్లో రైతులు పంటలు వేశారు. అలా సాగు చేసిన పంటలు ప్రస్తుతం ఎండుముఖం పడుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో 3.42 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. కానీ జూన్ 15 నుంచి నైరుతి నిరాశపర్చడంతో ప్రధాన పంటలు విత్తుకునే సమయం ముగిసేనాటికి అంటే జూలై ఆఖరుకు 40 శాతం విస్తీర్ణంతో 1.35 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగులోకి వచ్చాయి. ఇంకా 60 శాతం భూములు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఇక.. మిగిలిన సుమారు 2 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం కష్టమని రైతులు వాపోతున్నారు. గత నాలుగు దశాబ్దాల జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రధానపంట వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లకు గానూ ప్రస్తుతానికి 47 వేల హెక్టార్లకు పరిమితమైంది. మరో ప్రధాన పంట కంది 49 వేల హెక్టార్లు, 44 వేల హెక్టార్లకు గానూ పత్తి 14 వేల హెక్టార్ల వద్ద ఆగిపోయింది. ఆముదం 17 వేల హెక్టార్లకు గానూ 6,300 హెక్టార్లు, మొక్కజొన్న 15 వేల హెక్టార్లకు గానూ 10,500 హెక్టార్లు, సజ్జ 2,500 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 500 హెక్టార్లు, కొర్ర 200 హెక్టార్లలో సాగులోకి వచ్చాయి. పెద్దవడుగూరు మండలంలో 66 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం పత్తి సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నెలల తరబడి వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన వేరుశనగ, కంది, పత్తి, ఆముదం తదితర పంటలు చాలా ప్రాంతాల్లో వాడుముఖం పట్టగా మరికొన్ని ప్రాంతాల్లో ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి వారం పది రోజులు కొనసాగితే మునుపెన్నడూ లేని విధంగా కరువు కాటు తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సర్వత్రా చర్చనీయాంశం..

గతంలో కూడా చంద్రబాబు పాలనలో వరుస కరువులు విలయతాండవం చేశాయి. అప్పట్లో ఒక్కోసారి అకాల వర్షాలు, మరోసారి అసలు వర్షాలే కురవకుండా పంటలను తీవ్రంగా దెబ్బ తీశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేడు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మానిటరింగ్ టీమ్‌కు సహకరించండి

- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ ఈనెల 13 వరకు జిల్లాలో పర్యటించనుంది. కమిటీకి సమగ్ర వివరాలు, సమాచారం ఇవ్వడంతో పాటు సంపూర్ణ సహకారం అందించాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయస్థాయి మానిటరింగ్ బృందం రీసెర్చ్ అధికారి సాంబశివరావు, అసిస్టెంట్ రీసెర్చ్ అధికారి సబ్రితి నవ్యతో కలిసి ఇన్‌చార్జ్ కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారితో మాట్లాడి విజయగాథలను బృంద సభ్యులకు తెలియజేయాలన్నారు. బృందానికి క్షేత్రస్థాయిలో అధికారులు, మండల, గ్రామ సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ సామాజిక సహాయక కార్యక్రమం, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ప్రధాన మంత్రి గ్రామ సరోవరం పథకం తదితర పథకాల అమలును పరిశీలిస్తారన్నారు. గమనించిన అంశాలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. సమావేశంలో డ్వామా పీడీ సలీం బాషా, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, డీఆర్‌డీఏ ఏపీడీలు గంగాధర్, సత్యనారాయణ, సర్వే ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

దయనీయంగా రైతుల పరిస్థితి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో కలిసి ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అన్నదాత సుఖీభవ' కింద పెట్టుబడి సాయం రూ.20 వేలను గత ఏడాది కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని మండిపడ్డారు. రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5 వేలు ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 2,94,353 మంది రైతులకు 'భరోసా' అందిస్తే కూటమి ప్రభుత్వం 2,75,642 మంది రైతులనే అర్హులుగా తేల్చిందన్నారు. 18,711 మందికి కోత పెట్టడం అన్యాయమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉచితంగా బీమా ప్రీమియం చెల్లించడంతో పాటు ఏటా జూలైలోనే పెద్ద ఎత్తున పరిహారమూ అందజేశామన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఉచిత బీమా పథకాన్ని రద్దు చేసి బీమా లబ్ధిని అందని ద్రాక్షగా మార్చారన్నారు. గత ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయినా బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ వర్షాలు లేవన్నారు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 8.50 లక్షల ఎకరాలు కాగా 3.26 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయన్నారు.

అధిక ధరలకు యూరియా..

యూరియా, డీఏపీని వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని 'అనంత' మండిపడ్డారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ ఇబ్బంది పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో 46 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఇంత వరకు వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదన్నారు.

చీనీ రైతుల కష్టాలు..

చంద్రబాబు ప్రభుత్వంలో చీనీ రైతులకూ కష్టాలు తప్పడం లేదన్నారు. గతంలో టన్ను రూ.40 వేలు ఉండగా ఇప్పుడు టన్ను రూ.20 వేలకు మించడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చీనీ రైతులకు పంటల బీమా ద్వారా పెద్ద ఎత్తున పరిహారం అందజేశామని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. హెచ్ఎల్‌సీ, హంద్రీ–నీవా ద్వారా నీటి విడుదల నేపథ్యంలో ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు చేయాలన్నారు. హెచ్ఎల్‌సీ ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు విడుదల చేయాలన్నారు. జిల్లా నుంచి ప్రజలు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏరాసి నారాయణరెడ్డి, అనుబంధ విభాగాల జిల్లా ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్, రైతు విభాగం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి పెన్నం శివారెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జానీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నీలం భాస్కర్, గ్రీవెన్స్ సెల్ శింగనమల నియోజకవర్గం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు చెన్నంపల్లి వెంకటరెడ్డి, కొత్తపల్లి నాగలింగారెడ్డి, పురుషోత్తం, శ్రీనివాసులు, సుంకిరెడ్డి, నారాయణస్వామి, కసిరెడ్డి కేశవరెడ్డి, జగదీష్, పాటిల్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



రైతుల సమస్యలను ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వివరిస్తున్న అనంత, చిత్రంలో పెద్దారెడ్డి, పార్టీ నేతలు

ఎరువులు.. పడరాని పాట్లు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పంటల సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నా... ఎరువుల సమస్య నెలకొనడం గమనార్హం. ప్రధానంగా యూరియా దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటల కోసం రైతులు ఎగబడుతున్నా బస్తా యూరియా కూడా లభించే పరిస్థితి లేదంటున్నారు. వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం తగినంత నిల్వ ఉన్నట్లు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రస్తుతానికి డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల సమస్య లేకున్నా యూరియా నిల్వలు మాత్రం పూర్తిగా ఖాళీ అయినట్లు రీటైల్, హోల్‌సేల్ డీలర్లు వాపోతున్నారు. పొటాష్ కూడా తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా యూరియా సరఫరా నిలిపివేసినట్లు సమాచారం. కొన్ని కంపెనీల నుంచి కోటా మేరకు ఎరువుల సరఫరా సక్రమంగా కావడం లేదని చెబుతున్నారు.

అప్పట్లో ఎన్నడూ ఇలా లేదు..

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు జిల్లా అంతటా మంచి వర్షాలతో పంటల సాగు అధికంగా ఉన్నా ఎన్నడూ ఎరువుల సమస్య ఉత్పన్నం కాలేదు. నెలవారీ కోటా మేరకు ఎరువులు సరఫరా కావడం, ఆర్‌బీకేలు, డీసీఎంఎస్, పీఏసీఎస్ లాంటి సొసైటీల్లో కూడా పెద్ద ఎత్తున నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. కానీ కూటమి సర్కారు వచ్చాక ఎరువుల కోటా నామమాత్రం చేయడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది.

అధిక ధరలు..

ఖరీఫ్‌లో జిల్లాకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించారు. అందులో 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 19 వేల మెట్రిక్ టన్నులు డీఏపీ, 4,700 మెట్రిక్ టన్నులు ఎంఓపీ, 4 వేల మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ కాగా అత్యధికంగా 53 వేల మెట్రిక్ టన్నులు వివిధ కాంప్లెక్స్ ఎరువులు కేటాయించారు. కాంప్లెక్స్ ఎరువులు తగినంత సరఫరా అవుతున్నా యూరియా సరఫరా మందకొడిగా ఉంది. ఆరు మండలాల రైతులను ఆదుకుంటున్న స్థానిక డీసీఎంఎస్‌లో నాలుగు రోజులుగా యూరియా బంద్ కావడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో అక్కడక్కడా యూరియాను ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సొసైటీ వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

యూరియా కోసం బారులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని సహకార సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు.సోమవారం ఉదయమే పెద్ద సంఖ్యలో రైతులు వచ్చారు. చంటి బిడ్డలున్న మహిళలు కూడా క్యూలో నిల్చోవడాన్ని బట్టి క్షేత్రస్థాయిలో ఎరువుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు అర్థం చేసుకోవచ్చు.

ఈ పోస్టు... చాలా 'రేటు'!

- అనంత వన్‌టౌన్ సీఐ పోస్టుకు టీడీపీ నేతల బేరం!
- పోలీసు ఉన్నతాధికారుల మౌనంపై సర్వత్రా చర్చ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే పోలీస్ స్టేషన్ ఏదైనా ఉంది అంటే అది అనంతపురం నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషనే. గొలుసు దొంగలు, మట్కారాయుళ్లు, రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్, భూ కబ్జాలు ఇలా ఒకటేమిటి నిత్యం బాధితులతో ఈ స్టేషన్ కిటకిటలాడుతుంటుంది. అలాంటి స్టేషన్‌కు నెలన్నర రోజులుగా సీఐని నియమించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో బాధితులు స్టేషన్‌కు వస్తుంటారు.. వారి సమస్యలు పరిష్కరించాలనే కనీస ఆలోచన కూడా లేకుండా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రాయ'బేరాలు'...

వన్‌టౌన్ సీఐ పోస్టుకు టీడీపీ నేతలు బేరం పెట్టినట్లు తెలిసింది. రూ.15 లక్షల వరకూ పలుకుతోందని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.డబ్బు ఇవ్వకుంటే పోస్టింగ్ ఇచ్చేది లేదంటూ అధికార పార్టీ నేతలు తెగేసి చెబుతున్నారని, బేరం కుదరకపోవడంతోనే నెలన్నర రోజులుగా సీఐని నియమించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు సీఐలు అంత డబ్బు చెల్లించలేక వన్‌టౌన్‌కు రావడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో డబ్బు చెల్లించేదెవరు.. పోస్టింగ్ తెచ్చుకునేదెవరన్న విషయంపై పోలీసు వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. రాజకీయ ఒత్తిళ్లతో ఉన్నతాధికారులు కూడా ఎటూ తేల్చని దుస్థితి నెలకొనడం గమనార్హం.

రాజేంద్ర యాదవ్ సస్పెన్షన్ తర్వాత..

నెలన్నర క్రితం తన్మయి అనే ఇంటర్ విద్యార్థిని హత్య జరిగింది. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంగా సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి వన్‌టౌన్ స్టేషన్‌కు సీఐ లేరు. రాజేంద్రనాథ్‌యాదవ్ కూడా అప్పట్లో టీడీపీ నాయకుల ద్వారానే ఈ స్టేషన్‌కు వచ్చారు.

టూటౌన్ సీఐకి ఇన్‌చార్జ్ ఇచ్చినా..

రాజేంద్రనాథ్ సస్పెన్షన్ తర్వాత టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు వన్‌టౌన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కానీ రెండు స్టేషన్లు చూడటం ఆయన వల్ల కావడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుతం వన్‌టౌన్ ఎస్ఐగా ఉన్న వ్యక్తి బాధితుల సమస్యలు పరిష్కరించడం కన్నా భూముల పంచాయితీలు ఎక్కువగా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జల్లెడ పడుతున్నా జాడ లేదు!

- హిందూపురం బ్యాంకు దోపిడీ కేసులో కనిపించని పురోగతి
- మూడు బృందాలు గాలిస్తున్నా చిన్న క్లూ కూడా దొరకని వైనం
- చోరీల కట్టడిలో శ్రీసత్యసాయి పోలీసులు విఫలమయ్యారని విమర్శలు



దోపిడీ జరిగిన హిందూపురం ఎస్‌బీఐలో లాకర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: హిందూపురం పట్టణంలోని ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు సవాలుగా మారింది. సుమారు 11 కేజీలకు పైగా బంగారం (రూ.11 కోట్ల విలువ), రూ.30 లక్షల నగదు దోచుకుని వెళ్లి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకూ కనీసం చిన్న ఆధారాన్ని కూడా సేకరించలేక పోయారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పాటు అనంతపురం నుంచి మూడు బృందాల పోలీసులు, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి మూడు బృందాలు నాలుగు రోజులుగా జల్లెడ పడుతున్నా ఎక్కడా జాడ కూడా తెలియలేదు.

ఆనవాళ్లు దొరక్కుండా..

ఎంత తెలివైన దొంగలైనా ఎక్కడో ఒక చోట చిన్న తప్పు చేసి దొరికిపోతుంటారు. ఫింగర్ ప్రింట్స్ లోనో, సెల్‌ఫోన్ లొకేషన్ వల్లో చిక్కేస్తుంటారు. కానీ హిందూపురం ఎస్‌బీఐ దోపిడీ ఘటనలో దొంగలు అత్యంత జాగ్రత్త పడ్డారు. నేరస్తుడు ఎలక్ట్రికల్ పనిలో నిష్ణాతుడైనట్లు తెలుస్తోంది. ఫేజ్, న్యూట్రల్, ఎర్త్, ఇన్వర్టర్ కనెక్షన్ ఇలా అన్ని వైర్లనూ చాలా జాగ్రత్తగా కట్ చేశారు. సీసీ కెమెరా కనెక్షన్ మొదట్లోనే తొలగించారు. వెంట తెచ్చుకున్న మినీ గ్యాస్ సిలిండర్ నుంచి కట్టర్‌ను ఉపయోగించి కిటికీ ఇనుప చువ్వలు కత్తిరించారు. ముఖానికి మాస్కు, కాళ్లకు సాక్సు, చేతులకు గ్లౌజులు వేసుకుని అత్యంత పకడ్బందీగా లాకర్లను కట్ చేసి 11 కేజీలకు పైగా బంగారాన్ని దోచుకెళ్లారు. ఎక్కడా వేలిముద్రలు, పాదముద్రలు పడకుండా జాగ్రత్త పడినట్టు తెలిసింది. దోపిడీకి ఇద్దరు దొంగలు మాత్రమే వచ్చినట్టు తెలుస్తోంది. ప్రధాన నిందితుడు బ్యాంకు ఆవరణలో వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించినట్టు గుర్తించారు. తెల్లవారుజామున 1 గంట నుంచి 3 గంటలలోగా దోపిడీ జరిగినట్టు పోలీసులు నిర్ధారించారు.

ఘోరంగా విఫలం..

బ్యాంకు దోపిడీ దొంగలను పట్టుకునేందుకు వారం రోజులుగా పోలీసులు జల్లెడ పడుతున్నా ఎక్కడా ఆచూకీ లేదు. ప్రధానంగా సెల్ ఫోన్ వాడటం లేదని తెలిసింది. దొంగలు ఇతర రాష్ట్రానికి చెందిన వారై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బెంగళూరు, నెల్లూరు, హైదరాబాద్‌తో పాటు అనుమానం వచ్చిన చోటల్లా గాలిస్తున్నా జాడ దొరకలేదు. పుట్టపర్తి పోలీసులకు ఈ విషయం పెద్ద సవాలుగా మారింది. ఇదే కాదు చాలాచోట్ల దొంగతనాలు జరుగుతున్నా దొంగలను పట్టుకోవడంలో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. జిల్లాలో దొంగతనాలు ఎక్కువయ్యాయని, రికవరీలు తక్కువగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల తీరుతో సామాన్య ప్రజలకు మాత్రం ఆవేదనే మిగులుతోంది. బ్యాంకు లాకర్లలో బంగారం పెట్టినా దొంగిలిస్తుంటే ఏం చేయాలంటూ ఖాతాదారులు వాపోతున్నారు.

క్లుప్తంగా

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

బొమ్మనహాళ్: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా తెలిపిన మేరకు.. అందిన సమాచారం మేరకు సోమవారం బొమ్మనహాళ్ మండలం శ్రీరంగాపురం క్యాంపు వద్ద విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనంలో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పీఎస్‌కు తరలించారు. ఆర్‌ఐ బాలకృష్ణ ఫిర్యాదు మేరకు డ్రైవర్ నాగరాజు, బియ్యం వ్యాపారి రామకృష్ణ, బొలేరో వాహన యజమాని వీరభద్రస్వామిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. కాగా, పట్టుబడిన రేషన్ బియ్యాన్ని బొమ్మనహాళ్, విడపనకల్లు మండలాల్లో పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లుగా నిందితులు అంగీకరించారు.

ప్రభుత్వంతో జేఎన్‌టీయూ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం: పరిశ్రమల్లో రక్షణాత్మక విధానాలపై అవగాహన కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వంతో జేఎన్‌టీయూ(ఏ) ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను ఏపీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ కృష్ణయ్య పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం మేరకు పరిశ్రమల్లో కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా ఎలాంటి సాంకేతిక పరికరాలు ఉపయోగించుకోవాలనే అంశంపై జేఎన్‌టీయూలోని ఎలక్ట్రానిక్స్, కెమికల్, మెకానికల్ అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు తగిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. అలాగే పరిశ్రమల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ(ఏ) డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, కార్మికశాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కృష్ణార్పణం

- పేదల బియ్యం.. పెద్దల భోజ్యం
- 'పుష్ప' సినిమాను తలపించేలా రేషన్ బియ్యం స్మగ్లింగ్
- మూడు జిల్లాలను శాసిస్తున్న సోమందేపల్లి 'డాన్'
- అక్రమ దందాతో రూ.కోట్లు గడిస్తున్న వైనం
- అధికార పార్టీ అండతో ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికార గణం

పుష్ప సినిమాలో గంధపు చెక్కల స్మగ్లింగ్‌ను తలదన్నేలా రేషన్ బియ్యం అక్రమ దందా ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగుతోంది. సోమందేపల్లికి చెందిన ఓ రేషన్ మాఫియా డాన్ ఏకంగా మూడు జిల్లాల్లో తన అక్రమ వ్యాపారాన్ని విస్తరించాడు. రాజకీయ నాయకులతో పాటు అధికారులకూ భారీగా ముడుపులు ముట్టజెబుతూ రూ.కోట్లు గడిస్తున్నాడు. అతని దందా విస్తృతి చూసి 'రామ'రామ.. 'కృష్ణ' కృష్ణ అంటూ అధికారులే నివ్వెరపోతున్నారు.



సీకేపల్లి మండలం ఎన్ఎస్‌గేట్ వద్ద ఓ ధాబాలో వాహనం నుంచి రేషన్ బియ్యాన్ని స్టాక్‌పాయింట్‌కు తరలిస్తున్న దృశ్యం



స్టాక్ పాయింట్‌లో డంప్ చేసిన బియ్యం బస్తాలు

ధర్మవరం: మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని సోమందేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా అవతార మెత్తాడు. తొలుత పెనుకొండ నియోజకవర్గంతో మొదలు పెట్టి... మెల్లమెల్లగా మూడు జిల్లాలను శాసించే స్థాయికి ఎదిగాడు. ప్రతినెలా ఇతని అక్రమ సంపాదన రూ.కోటికి పైగానే ఉండటం ప్రజల్ని విస్మయానికి గురి చేస్తోంది.

దందా ఇలా..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను సదరు మాఫియా డాన్ కొత్త పుంతలు తొక్కించాడు. ఒకేసారి పెద్ద మొత్తంలో స్టాక్ ఉంచితే అందరికీ తెలిసిపోతుందని భావించి వినూత్నంగా ప్లాన్ చేశాడు. ఒక్కో జిల్లాలో 5 లేదా 6 వరకు స్టాక్ పాయింట్లు పెట్టుకుని అర్ధరాత్రి సమయంలో రవాణా చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఒక్కో నియోజకవర్గంలోని మండలం, పట్టణాలను వేరుచేసి రిటైల్‌గా కొంత మందికి కిలోపై రూ.3 చొప్పున కమీషన్ చెల్లిస్తూ బియ్యం సేకరించేలా పురమాయించాడు. సేకరించిన బియ్యాన్ని ఆటోలు, టాటా ఏస్ వాహనాల ద్వారా స్టాక్ పాయింట్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి రేషన్ మాఫియా డాన్ రాత్రి వేళ భారీ వాహనాల్లో గంటల వ్యవధిలోనే సరిహద్దులు దాటించి కర్ణాటకకు చేరవేస్తాడు.

వ్యాపార సామ్రాజ్యం విస్తరిస్తోందిలా..

తొలుత పెనుకొండ నియోజకవర్గం నుంచి మొదలు పెట్టిన రేషన్ దందాను ఆ తర్వాత ధర్మవరం నియోజకవర్గానికి సదరు డాన్ విస్తరించాడు. ధర్మవరానికి సమీపంలోని ఎన్ఎస్‌గేట్, సీకేపల్లి మండలం ప్యాదిండి, నామాల, మేడాపురం వద్ద స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశాడు. ధర్మవరం మండలంలో వివిధ రేషన్ షాపులు, ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని ఆటోల్లో స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. అలాగే అనంతపురం జిల్లాలోని వివిధ మండలాల్లో సేకరించిన బియ్యాన్ని రాప్తాడు మండలం కందుకూరు కెనాల్‌కు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌లో నిల్వ చేస్తాడు. ఇలా నిల్వ చేసిన బియ్యాన్ని ఐచర్ వాహనాల్లో లోడ్ చేసి కర్ణాటకలోని బంగారు పేటలో ఉన్న మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటాడు. సదరు మిల్లులో లావు బియ్యాన్ని సన్న బియ్యంగా ప్రాసెస్ చేసి అధిక ధరతో మళ్లీ ప్రజలకు విక్రయిస్తుండడం గమనార్హం.

మూడు జిల్లాల్లో జోరుగా వ్యాపారం..

శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, అనంతపురం జిల్లా పరిధిలోని ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాలతో పాటు వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో కూడా బియ్యం అక్రమ వ్యాపారాన్ని సదరు డాన్ విస్తరించినట్లు సమాచారం. ఇటీవల పులివెందులలో పట్టుబడ్డ రేషన్ బియ్యం కూడా సదరు డాన్‌వే అయినా బినామీలను చూపి బయటపడినట్లు తెలుస్తోంది.

అనతికాలంలోనే భారీగా అక్రమార్జన..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారంలో భారీగా అక్రమార్జన చేసినట్లు సమాచారం. ఆంధ్రాలో పేదల బియ్యాన్ని రిటైలర్ల దగ్గర రూ.18 చొప్పున కొని కర్ణాటకలో రూ.27 లెక్కన అమ్ముకుంటున్నారు. వందలాది వాహనాలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ ప్రతినెలా రూ.కోటికిపైగానే సంపాదిస్తున్నట్లు సమాచారం.

రాజకీయ ఒత్తిళ్లు..

కొందరు నిజాయితీ గల పోలీస్ అధికారులు రేషన్ బియ్యం వాహనాలను పట్టుకుంటే... వెంటనే జిల్లాలోని ఓ పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధితో పాటు బీజేపీకి చెందిన జిల్లా నాయకుడు రంగ ప్రవేశం చేసి కేసులు కట్టకూడదని ఒత్తిడి తీసుకెళుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాజాగా ధర్మవరం మండలం సీతారాం పల్లి వద్ద సదరు రేషన్ మాఫియా డాన్‌కు చెందిన ఓ ఐచర్ వాహనాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే కేసు కట్టకూడదని పోలీసులపై సదరు నేతలు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. వాహనంలో ఉన్నవి రేషన్ బియ్యం కాదని మీడియాకు చెప్పాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో తెల్లవారుజామున పట్టుకున్న బియ్యం వివరాలను సాయంత్రమైనా పోలీస్, రెవెన్యూ అధికారులు వెల్లడించక పోవడం గమనార్హం.

అధికారులకు మామూళ్లు..

మూడు జిల్లాల రేషన్ బియ్యం వాహనాలు ధర్మవరం, సీకేపల్లి, సోమందేపల్లి, కియా పోలీస్‌స్టేషన్, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా వెళ్తుంటాయి. ఈ మార్గంలోని పోలీస్‌స్టేషన్‌లకు రేషన్ మాఫియా డాన్ ప్రతి స్టేషన్‌కు ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మామూళ్లు ముట్ట చెప్పుతుండడం విశేషం. ఒకవేళ సదరు స్టేషన్‌లలో పోలీస్ ఉన్నతాధికారులు లంచం తీసుకునేందుకు నిరాకరిస్తే కిందిస్థాయి సిబ్బందితోనే పని చక్కబెడుతుంటాడు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన విజిలెన్స్ అధికారులు కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. రూ.1.80 లక్షల చొప్పున విజిలెన్స్ అధికారుల్లో కొందరికి మామూళ్లు అందుతుండటంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత



ధర్మవరం మండలం సీతారాం పల్లి వద్ద రేషన్ బియ్యం పట్టుబడ్డ దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీతారాంపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ధర్మవరం రూరల్ పోలీసులు 170.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ కేశవనాయుడు, వీఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది సోమవారం ఉదయం సీతారాంపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐచర్‌ను నిలిపి తనిఖీ చేశారు. అందులో 341 బ్యాగుల (170.50 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఐచర్ వాహన డ్రైవర్, బుక్కపట్నం మండలానికి చెందిన గుజ్జల సతీష్‌ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే సోమందేపల్లికి చెందిన నరేష్, చెన్నేకొత్తపల్లికి చెందిన సద్దాం ఈ కేసులో నిందితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు.

డయేరియా వ్యాప్తి కాకుండా చర్యలు చేపట్టండి : డీఎంహెచ్‌ఓ

శింగనమల: గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందకుడా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. శింగనమల సీహెచ్‌సీలో డయేరియాతో చికిత్స పొందుతున్న పెద్దమట్లగొంది గ్రామానికి చెందిన 14 మందిని సోమవారం ఆమె ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వాంతులు, విరేచనాలకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం పెద్దమట్లగొంది గ్రామాన్ని సందర్శించి, అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్.శంకర్ నాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలోని సాయి నగర్ రెండో క్రాస్ చివరన మట్కా ఆర్గనైజర్‌తో పాటు 8 మంది బీటర్లను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వివరాలను సోమవారం రాత్రి ఆయన వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురంలోని సంగమేశ్వర నగర్‌కు చెందిన తుమ్మల సరస్వతి, చంద్రబాబు కొట్టాల వాటర్ ట్యాంక్ దగ్గర ఉన్న నివాసమున్న షేక్ రసూల్, పాతూరు మున్నా నగర్‌కు చెందిన బండారి వన్నూరప్ప, అంబేడ్కర్ నగర్‌కు చెందిన మన్నల రామకృష్ణ, అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి నివాసి వడ్డే దస్తగిరి, ఉప్పరపల్లికి చెందిన అక్కెం రామాంజినేయులు, బోయ శ్రీరాములు, ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన పోతులయ్య అలియాస్ పోతన్న ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, మట్కా పట్టీలు, బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా ఖాద్రీశుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగ మంటపంలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభునికి సోమవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు సంతోష్ స్వామి, మంజునాథ్ స్వామి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. హోమాలు నిర్వహించి, వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లారీల ఢీ - ఒకరి మృతి



విడపనకల్లు: మండలంలోని గడేకల్లు వద్ద 67వ జాతీయ రహదారిపై సోమవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. లారీలు రెండూ పరస్పరం ఢీకొనడంతో క్యాబిన్‌లు నుజ్జునుజ్జయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కున్న హర్యానాకు చెందిన డ్రైవర్ జితేంద్రకుమార్ (35)ను స్థానికులు అతి కష్టంపై వెలికి తీసి వెనువెంటనే బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీ కొన్న టిప్పర్

పెద్దవడుగూరు: స్థానిక సాయిబాబా ఆలయంలో సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. ఘటనలో చిట్టూరు గ్రామానికి చెందిన యువకులు తరుణ్, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో భారీ వాహనం కిందకు బైక్ పడింది. బైక్‌పై ఉన్న ఇద్దరూ పక్కన పడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నారాయణపురంలో చైన్‌స్నాచింగ్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఓ దుండగుడు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు వెంకటలక్ష్మి ఇంటి బయట నిద్రిస్తుండగా తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 3 తులాల బంగారం మాంగల్యం చైన్‌ను లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో బాధితురాలు గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



మాట్లాడుతున్న జాఫర్

కూడేరు: విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సర్దుబాటు చార్జీల పేరిట ఏకంగా రూ.15485 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. సోమవారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిస్కంలో లోటును భర్తీ చేయడానికి ట్రూ ఆప్ చార్జీల పేరిట రూ.12771 కోట్ల అదనపు భారాన్ని మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని మండిపడ్డారు. ఈ ఆలోచనకు స్వస్తి చెప్పడంతో పాటు ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామంటూ ప్రకటించి.. తాజాగా పీఎం కిషాన్‌తో కలిపి విడుతల వారీగా ఇస్తామని ప్రకటించడం కుట్రలో భాగంగానే పరిగణించాల్సి వస్తుందన్నారు. హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపి, తొలుత కాలువ వెడల్పు పనులు పూర్తి చేయాలని, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ఆయకట్టుకు నీరందించాలన్నారు కోరారు. సమస్యలపై ఈ నెల 12,13 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహా సభల్లో చర్చించి, ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవ రెడ్డి, మండల కార్యదర్శి నాగేంద్ర, నేతలు మల్లికార్జున, పెరుగు సంగప్ప, రమణ, మలరాయుడు, వెంకటేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య



జగదీష్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: మూడు పదుల వయసు పైబడినా పెళ్లి కాలేదన్న వేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పరమేశ్వరప్ప, రత్నమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం తల్లి, ఎనిమిదేళ్ల క్రితం తండ్రి మృతి చెందారు. అప్పటి నుంచి ముగ్గురు అన్నదమ్ములూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్దకుమారుడు వెంకటేశులకు వివాహమైంది. రెండో కుమారుడు జగదీష్ (33)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే సంబంధాలు ఏవీ కుదరకపోవడంతో ఇక తనకు పెళ్లి కాదేమోనంటూ జగదీష్ తరచూ బంధువులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి



మృతుడు కుమారస్వామి

రాయదుర్గం టౌన్: పాము కాటుకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఎరికల కుమారస్వామి (66) ఆదివారం సాయంత్రం రాయదుర్గంలోని సీబీఎస్ కాలనీలో ఉన్న తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా చేతికి పాము కాటు వేసింది. నాటు వైద్యంతో నయం చేసుకునేందుకు ప్రయత్నించినా ఫలించకపోవడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి బంధువులు తరలించారు. పరిస్థితి విషమించి అదే రోజు అర్ధరాత్రి ఆయన మృతిచెందాడు. కాగా, కుమారస్వామికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్తంభించిన తపాలా సేవలు



అనంతపురంలోని ప్రధాన పోస్టాఫీసులో బోసిపోయిన కౌంటర్లు

అనంతపురం సిటీ: తపాలా శాఖలో మరింత పారదర్శకతతో పాటు వేగవంతమైన సేవలందించే క్రమంలో కేంద్ర తపాలా శాఖ గత నెలలో 2.0 కొత్త సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసిన సంగతి తెలిసిందే. దీని కోసం మూడు రోజుల పాటు తపాలా సేవలను బంద్ చేశారు. ఆ తర్వాత సర్వర్ మొరాయింపుతో అరకొర సేవలు కొనసాగుతూ వచ్చాయి. ఈ సమస్యను అధిగమించడం సాధ్యం కాకపోవడంతో సోమవారం ఒక్కసారిగా సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రెండు హెడ్ పోస్టాఫీసులతో పాటు 64 సబ్ పోస్టాఫీసులు, 407 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో తపాలా సేవలు స్తంభించాయి. అనంతపురం, గుంతకల్లు హెడ్ పోస్టాఫీసుల్లోని వివిధ రకాల కౌంటర్లు మూతపడ్డాయి. వచ్చిన జనం వచ్చినట్లే వెనక్కి వెళ్లిపోయారు. దూరభారం నుంచి వచ్చిన వారు సాయంత్రం వరకు వేచి చూశారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



భరత్ (ఫైల్)

యాడికి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం రాయచెరువులోని ఉప్పర వీధిలో నివాసముంటున్న శ్యామలమ్మ కుమారుడు భరత్‌కుమార్ (39) ట్రాన్స్ పోర్టు లావాదేవీలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నష్టం రావడంతో తన సొంత లారీలను అమ్మేసి ఓ లారీ డ్రైవర్‌గా జీవనం మొదలు పెట్టాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటిని కూడా అమ్మేశాడు. దీంతో దిక్కుతోచని శ్యామలమ్మ కర్నూలులోని తన చెల్లెలు కుమార్తె ప్రభావతి ఇంటికి చేరుకుంది. ఆదివారం రాత్రి రాయలచెరువులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న గాలి మిషన్ వద్ద నిద్రించిన భరత్‌కుమార్.. సోమవారం వేకువజాము 1 గంట సమయంలో నిద్ర లేచి రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి గుత్తి వైపు వెళుతున్న వాహనం ఢీకొంది. తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సీఐ ఈరన్న అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే భరత్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి శ్యామలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సమస్య పరిష్కరించాలంటూ గొడవ

- ఉన్నతాధికారిని నిలదీసిన సామాన్యుడు
- పరిష్కార వేదికలో 463 వినతులు
- అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : ఇన్‌చార్జ్ కలెక్టర్



అధికారులతో గొడవపడుతున్న బాధితుడు రఘు

అనంతపురం అర్బన్: తనకు మంజూరైన టిడ్కో ఇంటిని వేరొకరికి ఇచ్చారని, దీనిపై వందలసార్లు అర్జీ ఇచ్చినా సమస్యకు పరిష్కారం చూపలేదంటూ ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోలతో అనంతపురంలోని కోవూరు నగర్‌లో నివాసముంటున్న రఘు గొడవపడ్డాడు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ ఘటన చోటు చేసుకుంది. తనను ఏ కారణం చేత అనర్హుడిగా ముద్ర వేశారంటూ నిలదీశాడు. ఇల్లు ఇవ్వరు... అందుకు కారణం చెప్పరంటూ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశాడు. అధికారులు నచ్చచెప్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని బలవంతంగా ఆయనను బయటకు పంపాల్సి వచ్చింది. బయటకు వచ్చిన అనంతరం రఘు మాట్లాడుతూ.. 2018లో తనకు టిడ్కో కింద ఇల్లు మంజూరైందన్నారు. అటు తరువాత తన పేరున ఉన్న ఇంటిని వేరొకరికి ఇచ్చారని వాపోయాడు. ఇదేమని అడిగితే నిన్ను ఇనెలిజిబుల్ (అనర్హునిగా) చేశారని చెబుతారే తప్ప కారణం చెప్పడం లేదన్నారు. తనకు మంజూరైన ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, ఎఫ్ఎస్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జునుడు, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 463 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

తల్లిపాలు శ్రేష్టం

తల్లి పాలు బిడ్డకు అత్యంత శ్రేష్టమనే విషయంపై ప్రజలను చైతన్య పరచాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు-2025 పోస్టర్లను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ వరకూ తల్లిపాల ఆవశ్యకతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ, $ᐁ‡r t yl..

ప్రతి నెల 5న సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్స్ గవర్నెన్స్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆయన విడుదల చేశారు.

క్లుప్తంగా

కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తే సత్ఫలితాలుండే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్‌సీడీ 4.0 జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో వివిధ రకాల కేన్సర్ సంబంధిత కేసులు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, గైనకాలజిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాలి

అనంతపురం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు అధికంగా పెరిగాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు తెలిపారు. విషకీటకాలు, పాములు సంచరించే అవకాశం ఉండటంతో వాటిని తొలగించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ ఎ.మలోలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. గురుకులాల్లో సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజనేయులు, అప్వా జిల్లా అధ్యక్షుడు బంగి ఓబుళపతి, బాణాసి శీనా, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న జర్నలిస్టులు

అనంతపురం అర్బన్: వర్కింగ్ జర్నలిస్టులకు పెన్షన్ ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. 'జర్నలిస్టుల డిమాండ్ డే' పురస్కరించుకుని సోమవారం సంఘం ఆధ్వర్యంలో నాయకులు, జర్నలిస్టులు ప్లకార్డులతో కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు షఫీ, ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపుతోపాటు ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలపై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బిహార్ తరహాలో ఇక్కడా జర్నలిస్టులకు రూ.15 వేలు పెన్షన్ పథకాన్ని అమలు చేయడంతో పాటు సమాచార శాఖను బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అక్రిడిటేషన్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈనెల 6వ తేదీన జరగనున్న కేబినెట్ సమావేశంలో జర్నలిస్టులకు సంబంధించి అన్ని అంశాలు చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జయప్రకాష్, డాక్టర్ సూర్య, వేణుగోపాల్, విజయ కుమార్, సుధాకర్, బన్సీలాల్, కేశవ, దాదాపీర్, రాజారెడ్డి, పవన్, శింగనమల ప్రసాద్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

అనంతపురం రూరల్: నిబంధనల ప్రకారం పంచాయతీ, అహుడా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, రాజీవ్‌కాలనీ పంచాయతీ వార్డు మెంబర్ కొనకొండ్ల వెంకటేష్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రీమియం హోండా షోరూం నిర్వాహకులు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రెండవ ఫ్లోర్, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పంచాయతీ పరిధిలో చాలా చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్యశాఖాధికారుల నిర్లక్ష్యం..

ప్రాణాలతో చెలగాటం

- సీజ్ చేసిన ఆస్పత్రినే తెరిచిన డాక్టర్
- గుట్టుచప్పుడు కాకుండా ఆపరేషన్లు
- ఇటీవల తీవ్ర రక్తస్రావంతో గర్భిణి మృతి
- ప్రాణాలు పోతున్నా మేల్కొని జిల్లా అధికార యంత్రాంగం



గర్భిణి మృతిపై ఆరా తీస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం మెడికల్: ఆరోగ్యశాఖాధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. ఏకంగా సీజ్ చేసిన ప్రైవేట్ ఆస్పత్రిని తెరిచి యథేచ్ఛగా శస్త్రచికిత్సలు చేస్తున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రిని నిర్వహిస్తూ బరితెగిస్తున్నారు.. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్. డబ్బు కోసం గైనకాలజిస్టులు చేయాల్సిన కేసులను తీసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రి పేరు మార్చి రెండు రోజుల క్రితం ఓ గర్భిణికి చేసిన ఆపరేషన్ వికటించడంతో రక్తస్రావమై మృతి చెందడం కలకలం రేపుతోంది.

చర్యలు తీసుకోవడంలో విఫలం..

కూడేరు మండలం హంసాపల్లికి చెందిన రాధకు (30) కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు 2024 సెప్టెంబర్‌లో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్పించారు. కాగా అప్పట్లో .ఆ యూనిట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ రమణ నాయక్ స్టాఫ్‌నర్సు ద్వారా కేసును శ్రీనివాస్ నగర్‌లోని తన ఆస్పత్రి (లావణ్య ఆస్పత్రి)కి తీసుకెళ్లారు. గర్భసంచికి సంబంధించిన శస్త్రచికిత్స చేసిన కొద్ది రోజులకు ఆమెకు యూరిన్ రాలేదు. ఈ విషయంపై కుటుంబీకులు డాక్టర్‌ను ప్రశ్నించగా అతడి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. చివరకు జీజీహెచ్, కర్నూలుకు వెళ్లారు. కర్నూలులో పరీక్షించి వైద్యులు శస్త్రచికిత్స చేసే సమయంలో పీసీఎస్‌ఎల్ కట్ చేసినట్లు ఉందని తెలిపారు. కుటుంబీకులు 2024 సెప్టెంబర్ 24న ధర్నా చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో అదే నెల 26న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ఆస్పత్రిని సీజ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై సర్వజనాస్పత్రిలోని గైనకాలజిస్టు, అనస్తీషియా వైద్యుడు, యురాలజీ వైద్యుడు, జనరల్ సర్జన్‌ను విచారణ కమిటీ సభ్యులుగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా రాధా కేసుకు మత్తు మందు ఇచ్చిన ఓ వైద్యుడు, సర్జరీ విభాగంలోని ఓ అసోసియేట్ ప్రొఫెసర్‌ను విచారణ కమిటీలో నియమించడం గమనార్హం. డాక్టర్ రమణ నాయక్, అనస్తీషియా వైద్యుడు, స్టాఫ్‌నర్సుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి డీఎంఈకి నివేదిక సమర్పించారు. అయితే వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లోనే ఈ ఘటనపై చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు మరో గర్భిణి మృతి చెంది ఉండేది కాదు.

ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

'ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా శ్రీకృప పేరుతో డాక్టర్ రమణ నాయక్ ఆస్పత్రిని తెరిచి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇతడి నిర్లక్ష్యం కారణంగానే చదళ్లకు చెందిన రాధమ్మ అనే 5 నెలల గర్భిణి మృతి చెందింది. డాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ఫిర్యాదు చేశారు.

అధికారులు పట్టించుకుంటే ఒట్టు..

వాస్తవంగా సీజ్ చేసిన ఆస్పత్రిని ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖాధికారులు పరిశీలించాల్సింది. కేవలం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారుల నిర్లక్ష్యంతో సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్ గుట్టుచప్పుడు కాకుండా సీజ్ చేసిన తాళాలను తెరిచారు. లావణ్య ఆస్పత్రి బోర్డును తీసేసి శ్రీకృప ఆస్పత్రి పేరుతో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఈనెల 3న శ్రీ కృప ఆస్పత్రిలో చదళ్ల గ్రామానికి చెందిన రాధమ్మకు గర్భసంచికి సంబంధించి సర్జరీ చేస్తున్న సమయంలో ఆపరేషన్ థియేటర్‌లోని టేబుల్‌పైనే మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో డాక్టర్ రమణ నాయక్ ఖతర్నాక్ చేష్టలు బయటపడ్డాయి.

చర్యలకు సిఫార్సు చేశాం..

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డాక్టర్ వెంకట రమణ నాయక్‌పై చట్టపరంగా ముందుకెళ్తాం. గతంలో ఇతడి నిర్లక్ష్యానికి ఓ మహిళ తీవ్రంగా ఇబ్బంది పడింది. చికిత్సల కోసం కర్నూలు, బెంగళూరుకు వెళ్లింది. అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా లావణ్య క్లినిక్‌ను సీజ్ చేశాం. ఇప్పుడు అదే ప్రాంతంలో శ్రీ కృప పేరుతో ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అందులోనూ ఓ గర్భిణి మృతి చెందిన విషయాన్ని సీరియస్‌గా పరిగణించి చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేశాం.

– డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డీఎంహెచ్‌ఓ

కూటమివి డైవర్షన్ రాజకీయాలు



సీఎం చంద్రబాబు వైఫల్యాలను వివరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 19వ డివిజన్‌లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ (రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో) కార్యక్రమాన్ని మేయర్ వసీం ప్రారంభించారు. ఇంటింటా తిరిగిన మేయర్ వసీం.. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని పేర్కొన్నారు. డైవర్షన్, కక్ష సాధింపులతో కాలాన్ని వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. 19వ డివిజన్‌లో రూ.1.20 కోట్ల అభివృద్ధిని తమ ప్రభుత్వంలో చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఫయాజ్, అనుదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు



మాట్లాడుతున్న డీవైఈఓ మల్లారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇన్‌స్పైర్ నామినేషన్లతో మన జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేందుకు గణితం, సైన్స్ టీచర్లు కృషి చేయాలని గుత్తి డీవైఈఓ మల్లారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో గుత్తి, అనంతపురం డివిజన్ల పరిధిలోని సైన్స్, గణితం టీచర్లకు 'ఇన్‌స్పైర్ మనక్' పథకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఈఓ మల్లారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ మాట్లాడారు. నాణ్యమైన ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. నూతన ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. ఎస్‌సీఈఆర్టీ అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలల్లో సైన్స్ కార్యకలాపాలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠ్యాంశాన్ని వీలైనంత మేరకు ప్రయోగశాలల్లో వివరించాలని కోరారు. ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలి? ఒక ప్రాజెక్టును విద్యార్థి ఎలా ఎంపిక చేసుకోవాలి? సమస్యను ఎలా గుర్తించాలి? పరిష్కారాన్ని ఎలా అన్వేషించాలి? ప్రాజెక్టును ఎలా తయారు చేయాలి తదితర అంశాలపై ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్, కిరణ్, రఘురాములు, చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందభాస్కర్ రెడ్డి, మేడా ప్రసాద్ పాల్గొన్నారు.

రాంగ్ రూట్లో వస్తే చర్యలు

రాప్తాడు: 44వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్లో రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆటో నగర్ కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం ఆటో నగర్‌కు మరమ్మతుకు గురైన వాహనాలు వస్తుంటాయన్నారు. ఆ వాహనాలు రిపేరి అయిన తర్వాత ఆటో నగర్ నుంచి 44వ జాతీయ రహదారిపైకి వచ్చి రాంగ్ రూట్లో రాకపోకలు సాగించడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఆటో నగర్ నుంచి వాహనాలు జాతీయ రహదారి మీదుగా అనంతపురంలోకి వెళ్లకుండా, ఆటో నగర్ వెనుక వైపు నుంచి బెంగళూరు జాతీయ రహదారి మీదుగా రాప్తాడు నాలుగు రోడ్ల కూడలి మీదుగా అనంతపురంలోకి వెళ్లాలని సూచించారు.

'చెడు వ్యసనాలకు బానిస కావద్దు'



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్

అనంతపురం ఎడ్యుకేషన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ కోరారు. మాదకద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాలపై సోమవారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన కోసం కృషి చేయాలన్నారు. డ్రగ్స్ జోలికి వెళ్లి అసాంఘిక శక్తులుగా మారొద్దని సూచించారు. ఎక్సైజ్ సీఐ ఎం.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఏవీ ప్రసాద్ మాట్లాడుతూ.. పౌరులుగా మాదక ద్రవ్యాలను అరికట్టాలన్నారు. మాదకద్రవ్యాలకు బానిసై ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా సర్వస్వం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీగల్ టీఎం ఎస్ఐ బి.హనుమంతు, ఎక్సైజ్ ఎస్ఐలు జయ నరసింహ, జాకీర్ హుసేన్, నరేష్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జి.ఆనంద్ బాబు, సుదర్శన్ పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది జూన్ నెలలో వేర్వేరుగా అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ జగదీష్ ఆర్థిక సాయం అందజేశారు. అనంతపురం జిల్లాలో పని చేస్తున్న లక్ష్మిరెడ్డి కుటుంబానికి తోటి హోంగార్డుల నుంచి ఒక రోజు వేతనం రూ.5,11,200, గవర్నమెంట్ నుంచి బరియల్ చార్జెస్ కింద రూ.10 వేలు, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు బి.తిరుపాల్ నాయక్ రూ.10 వేలు, నరసింహులు కుటుంబానికి రూ.10 వేలు బరియల్ చార్జెస్ కింద ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

83 పిటీషన్ల స్వీకరణ..

అనంతపురం: మహిళలు, వృద్ధుల ఫిర్యాదులను ప్రాధాన్యతగా గుర్తించి సకాలంలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 83 పిటీషన్లు స్వీకరించారు. ప్రజల సమస్యలకు నాణ్యతగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం



ర్యాలీ చేపట్టిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు సంక్షేమం కరువైందని ఏఐఎస్ఎఫ్ నాయకులు ధ్వజమెత్తారు. వసతి గృహాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంత రాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఎస్సీ వసతి గృహం మరమ్మతులకు గురికావడంతో మూతబడిందన్నారు. మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గుత్తి బీసీ బాలికల వసతి గృహంలో 200 మందికి పైగా విద్యార్థులు ఉంటే 11 గదులు మాత్రమే ఉండడంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజనేయులు, నరసింహ యాదవ్, వంశీ, మంజూనాథ్, వెంకటనాయక్, చందు, పవన్, నవీన్, వినోద్, రాజేష్, సమీర్, మురళీ, రోహిత్, రజనీ, హర్ష, హేమత్ పాల్గొన్నారు.

'మానిటరింగ్'తో చదువుకు ఆటంకం

అనంతపురం ఎడ్యుకేషన్: అకడమిక్ మానిటరింగ్ పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగే ప్రమాదముందని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు వాపోయారు సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అకడమిక్ మానిటరింగ్ ఫోరం జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉన్నత పాఠశాలల నుంచి ఏడుగురు, ప్రాథమిక పాఠశాలల నుంచి ఐదుగురి టీచర్లు కలిపి మొత్తం 12 మంది ఉపాధ్యాయులను సభ్యులుగా నియమిస్తున్నారన్నారు. ఈ కమిటీ సభ్యులు వారానికి రెండు రోజుల చొప్పున నెలలో 8 రోజుల పాటు వారి పాఠశాలలకు దూరమవుతారన్నారు. ఆయా పాఠశాలల్లో విద్య కుంటుపడే ప్రమాదముందని వాపోయారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అవగాహన రాహిత్యం వల్ల స్కూల్ అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా పంపడం వల్ల ఇప్పటికే హైస్కూల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయులు లేక బోధనకు అడ్డంకిగా మారిందన్నారు. చాలా ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు తరలిపోతున్నారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు క్షీణ దశలో ఉంటే అకడమిక్ మానిటరింగ్ ఫోరం పేరుతో ఉపాధ్యాయులను నెలకు ఎనిమిది రోజులు పాఠశాలకు దూరం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు.

కార్గోలో కదులుతున్న డొంక



- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
- అక్రమార్కుల ఆగడాలకు కళ్లెం వేసేందుకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్గో కొరియర్ సర్వీసు (పార్శిల్ రవాణా)లో అక్రమాలపై డొంక కదులుతోంది. 'కార్గోలో ఖతర్నాక్'ల పేరుతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. అక్రమార్కుల ఆగడాలకు కళ్లెం వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఏటీఎం తన చాంబర్‌లో ఏర్పాటు చేసుకున్న ఏసీతో పాటు సీజ్ చేసిన బుకింగ్ సెంటర్ నిర్వాహకుడిని విచారించారు. ఈ క్రమంలో బాధితులు విచారణాధికారులతో తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. కాగా బుకింగ్ సెంటర్ సీజ్ చేసే సమయంలో ఆర్టీసీ ఏటీఎం అధికారి నిర్వాహకులను ఇష్టారాజ్యంగా దూషించినట్లు సమాచారం. సీజ్ చేసిన ప్రాపర్టీతో పాటు కంప్యూటర్, ఇతర పరికరాలు, ఐడీని తిరిగి ఇచ్చేందుకు వారి వద్ద నుంచి లంచంగా కొంత మొత్తాన్ని తీసుకున్నట్లు బాధిత నిర్వాహకుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు.

ఆర్టీసీ ఆదాయానికి గండి..

ఆర్టీసీ కార్గోలో విధులు నిర్వహిస్తున్న ఏటీఎం స్థాయి అధికారిపై ఆది నుంచి ఆరోపణలు ఉన్నాయి. గతంలో తాను పని చేసిన పలు ప్రాంతాలతో పాటు అనంతలో కూడా అదే కొనసాగింది. కారు అద్దె విషయంలో పక్కా ఆధారాలతో దొరికిన అతడిని అప్పటి ఆర్ఎం కాపాడారు. దీంతో తప్పు చేశానన్న భావనకన్నా మరో తప్పు చేయడానికి ఏటీఎం అధికారికి అధికారులు అవకాశం ఇచ్చినట్లైంది. దీంతో కాంట్రాక్టర్లు, బుకింగ్ సెంటర్ల నిర్వాహకులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కార్గోలో పని చేసే ఓ వ్యక్తి పేరుమీద నగరంలోని ఓ షాపులో 2025 జనవరి 21వ తేదీన రూ.32,500 విలువైన త్రీస్టార్ ఏసీని కొనుగోలు చేశారు. ఆ ఏసీని ఏటీఎం అధికారి తన చాంబర్‌లో అమర్చుకున్నారు. తాజాగా అధికారులు తనిఖీలు చేయగా ఏసీ కంటపడింది. విషయం కాస్త బయటకు పొక్కటంతో ఏసీని తిరిగి తన రూమ్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రైవేటు బుకింగ్ సెంటర్‌లో వ్యాపారం చేయిస్తే రూ.15 శాతం కమిషన్ వస్తుందన్న ఆశతో ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టి ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి వ్యాపారాన్ని తప్పుదారి పట్టించారన్న ఆరోపణలు కూడా సదరు అధికారిపై ఉన్నాయి. ఆర్టీసీ డిఎం, విజిలెన్స్ అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. విచారణ పూర్తయితే కాని వాస్తవాలు వెల్లడించలేమని అధికారులు చెబుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఆత్మకూరు: పుట్టిన మూడు సంవత్సరాల వరకు పిల్లలకు తల్లిపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిపాలు తాపడం వలన కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తెలియజేయాలని సూచించారు. గర్భిణులు రుచికరమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మాకు తెలియకుండా సర్వే చేశారు'

రాప్తాడు: మాకు తెలియకుండా గ్రామ సర్వేయర్ సాయి భూమి కొలతలు వేసి, రాళ్లు పాతారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన రైతు, మాజీ డీలర్ జీ.టి.ప్రసాద్ రెడ్డి కోరాడు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇచ్చాడు. తహసీల్దార్ విజయకుమారి మాట్లాడుతూ.. నోటీసులు ఇవ్వకుండా పొలం కొలవకూడదన్నారు. మళ్లీ చుట్టుపక్కల ఉన్న యాజమానులకు నోటీసులు జారీ చేసి పొలానికి కొలతలు వేయిస్తామని హామీ ఇచ్చారు.